14న ముహూర్తం..!

- బిహార్ ఎన్నికల తరువాత రాజకీయ మార్పులు..?
- కొందరు మంత్రులకు చలనం గ్యారెంటీ!
- ముఖ్యమంత్రి మార్పుపైనే సర్వత్రా చర్చలు..!

6



వ జ నం



- అటవీప్రాంతాల్లో పెరిగిన వాహన సంచారం
- వెలుతురు, హారన్ శబ్దానికి హడలెత్తుతున్న వన్యప్రాణులు
- రాత్రివేళల్లోనూ సఫారీపై పర్యావరణ ప్రేమికుల ఆందోళన
- మానవ, జంతు సంఘర్షణపై నిరసన



బండిపుర సఫారీ ప్రవేశద్వారం

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లోకి జంతువులు వచ్చి దాడులు చేస్తున్నాయని సర్వత్రా ఆందోళనలు పడుతున్న సంగతి తెలిసిందే. అయితే వనాల్లోకి వెళ్తున్న జనం వన్యప్రాణులను హడలెత్తిస్తుం డంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల సఫారీని రాత్రి వేళల్లో కూడా నిర్వహించడం పర్యావరణాన్ని ప్రమాదంలో పడేస్తుందని పలువురు వాపోతున్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు అనుబంధంగా ఉండే పశ్చిమకనుమలతో పాటు పలు ప్రాంతాలలో అభయారణ్యాలు నెలకొని ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో సఫారి కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఒకప్పుడు అడవిలో ఉండే చిరుత, పులి, ఏనుగులు నిత్యం జనావాసాలపై దాడులు చేస్తున్నాయి. దాదాపు ఏడెనిమిది జిల్లాల్లో సాయంత్రమైతే బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. పంట పొలాలకు ఒంటరిగా వెళ్లడం కష్టమవుతోంది. గొర్రెలు, పశువుల కాపరులు అటవీ ప్రాంతాల సమీపంలో వెళ్లాలంటే వెనుకడుగు వేస్తున్నారు. ఇలా వన్యప్రాణులు నిరంతరంగా మానవ సంఘర్షణకు కారణమవుతున్నాయి. శుక్రవారం ఏనుగు దాడిలో ఇద్దరు అన్నదమ్ములు, పులి దాడిలో ఒక రైతు మృతి చెందారు. కేవలం ఒకరోజులోనే ముగ్గురి ప్రాణాలు వన్యప్రాణులు బలిగొనడంతో అటవీశాఖపై ప్రజలలో ఆగ్రహం పెల్లుబికింది. ఇది ఒక్కరోజుతో ముగిసిన ప్రమాదం కాదు. నిరంతరంగా వన్యప్రాణులు, మానవ సంఘర్షణలు ప్రధాన కారణం అటవీ ప్రాంతాల్లో మానవ సంచారం, ఇతరత్రా ప్రయోగాలు అత్యధికం కావడమే.




కాకానకోటెలోని సఫారీ బస్సు

- సాధారణంగా వన్యప్రాణులు తెల్లవారుజామున లేదా సాయంత్రం వేళ ఆహారం కోసం వేటకు బయల్దేరుతాయి. ఇక జింకలు అటవీ సరిహద్దులకు వస్తుండడంతో పులి, చిరుతలు వెంబడిస్తున్నాయి. ఇలా సఫారీలో అటవీప్రాంతాలలో 20 కిలోమీటర్లదాకా మాత్రమే ఉండాలి. కానీ కే గుడి ప్రాంతంలో 35 కిలోమీటర్ల మేర ఎత్తున ఉన్నాయి. ఇలా కిలోమీటర్లకొలదీ అటవీప్రదేశంలోకి సఫారీ వాహనాలు చొచ్చుకుపోతుండడంతో భయపడే వన్యప్రాణులు ఎటుపడితే అటు పరిగెడుతున్నాయి అవే గ్రామాలు, పంట పొలాలవైపు వచ్చేందుకు కారణమవుతున్నాయి.



కబ్బన్ పార్క్ సఫారీ కేంద్రం

ఒకప్పుడు అటవీప్రాంతంలో సఫారీలు కేవలం అధ్యయనానికి మాత్రమే పరిమితంగా ఉండేది. కానీ ఇటీవల కొన్నేళ్లుగా అటవీశాఖ గేట్‌లు ఎత్తేసినట్లుగా నిబంధనలు గాలికి వదిలేసింది. పరిమితికి మించ సఫారీలు సాగుతున్నాయి. పైగా అటవీప్రాంతాలలో జంగిల్ రిసార్టులు, రోడ్ల ఏర్పాటు, విద్యుత్‌లైన్‌లు ఇతరత్రా నిర్మాణాలు జరిపారు. దీంతో అటవీ ప్రాంతాలలోకి మానవసంచారం పెరుగుతోంది. ఇది వన్యప్రాణుల సంచారానికి అడ్డంకిగా మారింది. ఇటీవల వేలాదిమంది సఫారీల్లో సంచరించి వన్యప్రాణులను చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో నిత్యం మానవ సంచారం అధికంగా మారిందని చెప్పవచ్చు. ఏ అటవీప్రాంతంలోనైనా పగటివేళల్లో మాత్రమే సఫారీతోపాటు ఆ ప్రాంతంలోని రోడ్డు మార్గాలలో వాహనాల సంచారానికి అవకాశం ఉండేది. కానీ రాత్రివేళల్లో కూడా సఫారీలకు వెసలుబాటు కల్పించారు. రాత్రిళ్లు పులులు, ఏనుగులతోపాటు పలు వన్యప్రాణులను వీక్షించడం కొత్త అనుభూతి ఇస్తోందని పర్యాటకులు ఆశిస్తున్నారు. అందుకు అనుగుణంగానే అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రివేళ సఫారీల నిర్వహణపై పర్యావరణ నిపుణులు కొన్నేళ్లకాలంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అయితే వారి డిమాండ్లు పట్టించుకునే స్థితిలో అటవీ అధికారులు లేరు. రాత్రివేళల్లో సఫారీల్లో తిరుగుతుండడం వల్ల హారన్లశబ్దం, హెడ్‌లైట్ వెలుతురులతో వన్యప్రాణులు ఆటంకానికి లోను అవుతున్నాయి. అవి తమ పరిధిదాటి అటవీప్రాంతాల సమీపంలోని గ్రామాలవైపు వస్తున్నాయి. కుక్కలపై దాడి చేసేందుకు అలవాటుపడిన చిరుతలు నిరంతరంగా మానవసంఘర్షణకు కారణమవుతున్నాయి. సఫారీలను నియంత్రించాలని అటవీశాఖ మంత్రిని కోరేందుకు రైతుసంఘాల ముఖ్యులు ప్రయత్నించారు. అయితే అది సాధ్యం కాకపోవడంతో మైసూరు, చామరాజనగర జిల్లాల్లో ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి.



కె గుడిలోని వైల్డ్‌నెస్‌క్యాంప్

- కేరళ టూరిజం ఓ మోడల్‌గా నిర్వహిస్తోంది. అక్కడ పగటివేళల్లో మాత్రమే సఫారీకి అవకాశం ఇస్తున్నారు. అటవీప్రాంతాలలో ఎక్కువ సఫారీలకు అవకాశం ఇవ్వడం లేదు. బండిపుర, నాగరహొళె పులుల అభయారణ్యంలో వన్యప్రాణుల వీక్షణకు వచ్చేవారిసంఖ్య పెరుగుతోంది. దీంతో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా సఫారీ వాహనాలు సంచరిస్తున్నాయి. సఫారీలను రాత్రివేళ నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం బండిపురలోనే 28 సఫారి వాహనాలు ఉన్నాయి. వాటిలో ఒక ట్రిప్‌ను తగ్గించినా రాత్రివేళ ప్రభావం తగ్గే అవకాశం కనిపిస్తోంది.

సఫారి కేంద్రాలు	ట్రిప్‌లు	వాహనాలు
బండిపుర	8	28
కె గుడి	2	7
వీరణహొసళ్లి	2	3
నానచ్చిగేట్	4	9
కాకానకోటె	4	7



బండిపుర సఫారి వేళలు తెలిపే బోర్డు

వీరప్పన్ కాలంలోనే బాగుండేది

- తీవ్రమైన మానవ, వన్యప్రాణుల సంఘర్షణ
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?
- మంత్రి ఎదుటే రైతుల ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గంధపుకొయ్యల స్మగ్లర్ వీరప్పన్ కాలంలోనే అటవీప్రాంతం బాగుండేదని, ప్రస్తుతం నిరంతరం వన్యప్రాణుల, మానవ సంఘర్షణలు అధికమయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చామరాజనగర, మైసూరు జిల్లాలకు చెందిన రైతులతో చామరాజనగరలోని కేడీపీ సభాంగణంలో ప్రత్యేక సమావేశం జరిగింది. అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు ప్రభుత్వంపై మండిపడ్డారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వన్యప్రాణులు, మానవ సంఘర్షణలు రాష్ట్రంలో జరుగుతున్నా యన్నారు. ఇందుకు అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని అసంతృప్తి వ్యక్తం చేశారు. పులుల అభయారణ్యంలో అక్రమంగా రిసార్టులు ఏర్పాటు చేశారని, వీరప్పన్ ఉన్నప్పుడు అడవి బాగుండేదని, అక్రమంగా తవ్వకాలు, రిసార్టులు ఉండేవి కాదన్నారు. అధికారులకంటే వీరప్పన్ నయమని మండిపడ్డారు. వన్యప్రాణుల దాడిలో రైతులు చనిపోతే మంత్రి, స్థానిక ఎమ్మెల్యేతోపాటు డీసీఎఫ్‌లపై కేసులు నమోదు చేయాలన్నారు. చిరుతల దాడిలో మనుషుల మృతికి మంత్రే కారణమన్నారు. ఇప్పటికే అటవీశాఖ మంత్రి నైతికబాధ్యతతో రాజీనామా చేయాల్సి ఉండేదన్నారు. ముందుగానే సమావేశాలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుని ఉంటే ప్రమాదాలు జరిగేవి కాదన్నారు. సమావేశానికి ముందు మంత్రి మీడియాతో మాట్లాడుతూ వన్యప్రాణుల, మానవసంఘర్షణను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని సమస్య పరిష్కారం కోసమే రైతులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బన్నేరుఘట్టలో అడవి దున్న, జింక మృతిపై విచారణ జరుపుతున్నామన్నారు. సమావేశంలో మంత్రి వెంకటేష్, ఎమ్మెల్యేలు పుట్టరంగశెట్టి, ఏఆర్ కృష్ణమూర్తి, ఎంఆర్ మంజునాథ్, దర్శన్ ధ్రువనారాయణ, ఎమ్మెల్సీ మంజేగౌడ, అటవీశాఖ అధికారులు, సీఎఫ్‌లు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, వెంకటేశ్

మహిళా అభ్యర్థులకు పరీక్ష

- కే-సెట్‌లో ముక్కుపుడకలు, తాయత్తులు, దారాల తొలగింపు
- సిబ్బంది చర్యలపై విమర్శల వెల్లువ

బళ్లారి గాంధీనగర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన (కే-సెట్) కర్ణాటక రాష్ట్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పరీక్షకు హాజరైన మహిళా అభ్యర్థులకు చేదు అనుభవం ఎదురైంది. పరీక్షలను రాసేందుకు వచ్చిన అభ్యర్థుల ముక్కుపుడకలు, చెవి దుద్దులు కట్ చేసిన తర్వాతే హాల్‌లోకి అనుమతించారు. చేతికి వేసుకున్న గాజులు, మెడలో వేసుకున్న దారాలను పరీక్షా సిబ్బంది తొలగించడం విమర్శలకు దారి తీస్తోంది. బళ్లారి నగరంలో ఏర్పాటు చేసిన 20 పరీక్షా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పోటీ పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపింగ్ జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో కే-సెట్ బోర్డు నిబంధనలు కట్టుదిట్టంగా అమలు జరిపారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఎలాంటి జిరాక్స్ సెంటర్లు తెరవకుండా కట్టుదిట్టమైన ఆదేశాలు జిల్లా అధికారి నాగేంద్ర ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మహిళా అభ్యర్థులు తమతమ ధార్మిక భావాలతో మెడలో ధరించిన తాయెత్తులు, ఇతరత్ర పూజా దారాలను తీయలేమని మొండికేసినా... తొలగించాల్సిందేనని పరీక్షాసిబ్బంది పట్టుబట్టారు. సిబ్బంది చర్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ముక్కుపుడకలు, చెవిపోగులు కట్ చేస్తున్న పరీక్షా సిబ్బంది

10 నుంచి జనగణన



- ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న అధికారులు
- రాష్ట్రంలో మూడు జిల్లాల్లో సర్వే
- సమాచార సేకరణకు ప్రత్యేక మొబైల్ అప్లికేషన్

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం కులగణన సర్వే ముగించిన తరుణంలోనే కేంద్రప్రభుత్వం జనాభా లెక్కల సేకరణకు సిద్ధమైంది. సమాచారం సేకరించేందుకు రూపొందించిన డిజిటల్ వ్యవస్థను పరీక్షించి లోపాలను సరిదిద్దే విధంగా ప్రయోగాత్మకంగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది. ఈనెల 10నుంచి రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ప్రయోగం దేశంలో తొలి సంపూర్ణ డిజిటల్ జనాభా లెక్కల ప్రక్రియలో తొలి అడుగు కానుంది. గతంలో జనాభా లెక్కలను కేవలం పేపర్లద్వారానే సేకరించేవారు. ఈసారి ఆ విధానాన్ని వదిలి మొబైల్ యాప్ ఆధారంగా సమాచారాన్ని సేకరించనున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే రెండు సర్వేలను పూర్తిగా డిజిటల్ రూపంలోనే చేపట్టింది. అయితే తొలిసారి కేంద్రం కూడా ఇదే పద్ధతిని చేపట్టనుంది. నవంబరు 1నుంచి 7వరకు జనాభా లెక్కల పోర్టల్ ద్వారా స్వయంగా గణాంకాను చేపట్టనున్నారు. ఇది ముందస్తు పరీక్షల కోసం ఎంపిక చేసిన ప్రదేశాల్లో నివసిస్తున్న వ్యక్తులను ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేటర్లు ప్రక్రియ చేపట్టనున్నారు. సులభ, ప్రామాణికంగా కార్యాచరణను ధ్రువీకరించేందుకు క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు, పర్యవేక్షకులు, ఇన్‌చార్జ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. మూడు బ్యాచ్‌లుగా ఈనెల 4నుంచి 6వరకు ఏకకాలంలో శిక్షణ ఇస్తారు. 2026 ఏప్రిల్ నుంచి జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అంతకుముందే ప్రయోగాత్మకంగా వివిధ దశల్లో ప్రక్రియను ఎలా అమలు చేయాలనే కార్యక్రమంలో భాగంగా పర్యవేక్షిస్తున్నారు. డిజిటల్ వ్యవస్థ పరీక్ష, పరిష్కరణకు ప్రాధాన్యం, ఒక వార్డు, 73 గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. సేకరించిన సమాచారాన్ని మౌల్యమాపనం ఉద్దేశానికి మాత్రమే వినియోగించ నున్నారు. ఇది అధికారికంగా జరుపుతున్న ప్రక్రియ అయినా జనాభా లెక్కల్లోకి చేర్చరు. నగర ప్రదేశాలలో మొబైల్ నెట్‌వర్క్ ద్వారా సేకరణ చేయనున్నారు. ఇది కేవలం ప్రయోగాత్మకమైన ఉద్దేశమని అధికారులు పేర్కొంటున్నారు. 20 రోజులపాటు సమాచార సేకరణ చేపట్టనున్నారు. వివరాల సేకరణతోపాటు వాటిని క్రోడీకరించుకోవడం, సమగ్రంగా వివరాలు, ఏ విధంగా విభజించుకోవాలనేది దీని ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో బెంగళూరు నగర, ఉత్తరకన్నడ, చామరాజనగర జిల్లాలను ముందస్తుగానే జనాభా లెక్కల సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఉత్తర కన్నడ జిల్లా జోయిడా తాలూకాలోని 46 గ్రామాలు, చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకాలో 27 గ్రామాలు, బెంగళూరు ఉత్తర ప్రాంతంలోని జేపీ పార్క్ వార్డులో ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఇటీవలే రాష్ట్రంలో కులగణన ముగిసిన సంగతి తెలిసిందే.

క్రీడల్లో భాగస్వామ్యమే ముఖ్యం: సీఎం

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనే ప్రతిఒక్కరూ గెలవాలని భావించరాదనీ, భాగస్వామ్యం ముఖ్యమని సీఎం సిద్దరామయ్య అన్నారు. క్రీడలు, యువజనులశాఖ, ఒలింపిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా కంఠీరవ స్టేడియంలో 14ఏళ్లలోపు మినీ కర్ణాటక క్రీడా కూటను ఆదివారం సీఎం లాంఛనంగా ప్రారంభించారు. తమ ప్రభుత్వం క్రీడలను నిరంతరంగా ప్రోత్సహిస్తోందన్నారు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొని పతకం సాధించేవారికి పోలీసుశాఖలో 3శాతం ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. ఇతరశాఖలలో 2శాతం ఉద్యోగాలు ఉన్నాయన్నారు. మంత్రి రామలింగారెడ్డి, ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ పాల్గొన్నారు.

కొడవ అంటే హాకీ: సీఎం

కొడవ సామాజికవర్గానికి చెందినవారు హాకీని ఎంతగా ప్రేమిస్తారో తెలిసిందేనన్నారు. కొడవ అంటే హాకీఅనే నానుడి ఉందన్నారు. చేనండ హాకీ పోటీలకు ప్రభు త్వం కోటి రూపాయలు గ్రాంటు కేటాయిస్తుందన్నారు. అధికారిక ని వాసం కృష్ణలో చేనండ హాకీ పోటీల లోగోను విడుదల చేశారు. అంతర్జాతీయ స్థాయిలో హాకీలో పాల్గొని దేశానికి పేరు తెచ్చినవారు ఉన్నారని కొనియాడారు. 2026 మేలో పోటీలు జరుగుతాయన్నా రు. సీఎం న్యాయ సలహాదారుడు పొన్నణ్ణ, మంత్రులు బోసరాజు, భైరతి సురేశ్, శివరాజ్ తంగడిగ, ఎమ్మెల్యే రాఘవేంద్రహిట్నాల్ పాల్గొన్నారు.



క్రీడాజ్యోతి అందుకుంటున్న సీఎం

నేడు ఢిల్లీకి మంత్రి సతీశ్ జార్కిహొళి

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నవంబరులో క్రాంతి లేదని రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేతలు వ్యాఖ్యానిస్తున్నా హస్తినకు తొలి పర్యటన ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందనే ఉత్కంఠ మొదలైంది. ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి సోమవారం ఢిల్లీ వెళ్తున్నారు. అక్కడ ఎవరిని కలుస్తారో... ఎటువంటి అంశాలపై చర్చిస్తారనేది కాంగ్రెస్ వర్గాలలో చర్చనీయాంశమైంది. సతీశ్‌జార్కిహొళి ఢిల్లీలో ఎన్నిరోజులు గడపనున్నారు, ఎవరిని కలుస్తారనేది ముఖ్యమైన అంశంగా మారింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో బెం గళూరులో విశ్రాంతి తీసుకుని ఢిల్లీ చేరుకున్నారు. బిహార్ ఎన్నికల ప్రచార వేడి సాగుతున్న ఎక్కువ ప ర్యటనలు రాహుల్‌గాంధీ, ఇతర నేతలు పాల్గొనే అవకాశం ఉంది. మల్లికార్జున ఖర్గే ఢిల్లీలోనే ఉంటారని తెలుస్తోంది. ఇటీవలే సీఎం సిద్దరామయ్య ఆశయాలు భావాలు కల్గిన వారసుడు సతీశ్ జార్కిహొళి అంటూ స్వయానా సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే పార్టీ నిర్ణయమే ముఖ్యమని, నేను సీఎం రేసులో లేనని సతీశ్ జార్కిహొళి స్పష్టం చేశారు. అయితే ఢిల్లీలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో అనేది ముఖ్యంగా ఉంది. సతీశ్ జార్కిహొళి ఢిల్లీ పర్యటనపై డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరులో స్పందిస్తూ పార్టీ నాయకులను ఎవరైనా కలవవచ్చునని అందులో తప్పు లేదన్నారు. ఏమైనా నవంబరు ప్రారంభంలోనే పార్టీలో గుసగుసలు ప్రారంభమయ్యాయి.



సేవ్ లాల్‌బాగ్

- సొరంగ మార్గంపై బీజేపీ నిరసన

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరానికి శ్వాసకోశంలో ఉండే లాల్‌బాగ్ ఉద్యానవనంలో సొరంగమార్గాన్ని నిర్మించడం ద్వారా పర్యావరణానికి భంగం కలిగించేలా కాంగ్రెస్ కుట్ర పన్నిందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టదలిచిన సొరంగ మార్గాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాచైతన్య అభియాన జరిపారు. లాల్‌బాగ్‌లో మెయిన్‌గేట్ నుంచి అన్నిప్రాంతాల్లోనూ పాదయాత్ర చేసి అభిప్రాయాలు సేకరించారు. సొరంగమార్గం వల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ జరిపారు. లాల్‌బాగ్ గుట్టపై ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ లాల్‌బాగ్‌లో ఆరు ఎకరాల ప్రదేశంలో సొరంగమార్గం వెళ్తే అధ్వానం కాదా..? అని ప్రశ్నించారు. బెంగళూరులో పర్యావరణాన్ని అభిమానించే వారి ఆశయాలకు దెబ్బతీసేలా వ్యవహరిస్తోందన్నారు. సస్యకాశిగా పేరొందిన లాల్‌బాగ్‌లో గోతుల రోడ్లు అవసరమా..? అని ప్రశ్నించారు. రేపటితరంలో మేం ఉండమని, మీరు ఉండరని, కానీ భవిష్యత్తులో లాల్‌బాగ్ ఉనికి కోల్పోరాదన్నారు. ఎంపీ తేజస్వీసూర్య మాట్లాడుతూ నగరంలో 70శాతం ద్విచక్రవాహనాలు ఉన్నాయని కేవలం 10శాతం మాత్రమే కార్లు ఉపయోగిస్తున్నారన్నారు. 18కిలోమీటర్లు టన్నెల్ రోడ్డు వేస్తే ట్రాఫిక్ సంపూర్ణంగా తగ్గుతుందని చెప్పగలరా..? అని ప్రశ్నించారు. కేవలం కార్లలో తిరిగేవారికోసం వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. రూ.16-20వేల కోట్ల ఖర్చుకు ప్రభుత్వం సిద్ధం అయ్యిందన్నారు. కిలోమీటరు సొరంగ మార్గానికి రూ.1285 కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇస్రో చేపట్టిన మంగళయాన్ ప్రాజెక్టుకు ఇంతకంటే తక్కువ బడ్జెట్‌తో సాధ్యమైందన్నారు. లాల్‌బాగ్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించరాదన్నారు. ఎమ్మెల్యేలు అశ్వత్థనారాయణ, కేసీ రామమూర్తి, రవిసుబ్రహ్మణ్య, ఉదయగరుడాచార్‌తో పాటు మాజీ కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు. సొరంగమార్గం ప్రతిపాదించిన స్థలం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూర్ఖుడిని కాదు: డీసీఎం

లాల్‌బాగ్‌ను పాడుచేసేందుకు తాను మూర్ఖుడిని కాదని డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. ఆదివారం నగరంలో మీడియాతో మాట్లాడిన ఆయన సొరంగ మార్గంను వ్యతిరేకించడం మాని సలహాలు ఇవ్వండి అంటూ బీజేపీ నాయకులను కోరారు. సంతకాలు సేకరించే అభియాన నాకు తెలుసు అన్నారు. ఒక సంస్థ ద్వారా నిరసన చేపట్టదలిచారని, మేం పార్టీ ద్వారానే ముందుకెళ్తామన్నారు. ఆర్ఎస్ఎస్ లేకపోతే బీజేపీ శూన్యమన్నారు. వారిలో 20శాతం మంది మినహా మిగిలినవారంతా ఇతరపార్టీలనుంచి వెళ్లినవారే అన్నారు. మెట్రో రైలు సొరంగమార్గంలో కొనసాగడం లేదా అంటూ ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య పెద్ద నాయకుడని భావించుకుంటున్నారన్నారు. విమానంలో అత్యవసర ద్వారాన్ని తెరిచే ప్రయత్నం చేసింది తేజస్వి కాదా..? అన్నారు. అనుమతి లేకుండానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసేందుకు ప్రయత్నించి ఎలాంటి పరాభవం పొందారో తెలిసిందేనన్నారు. నాటకాలు మంచివి కాదన్నారు. తేజస్వి సూర్య సబర్బన్ రైలు కావాలని చెబుతారని అంతటి ప్రదేశం బెంగళూరులో లభిస్తుందా..? అన్నారు.



నిరసనలో ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ తేజస్వి సూర్య, ప్లకార్డులతో మహిళలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	12,738	11,667
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,431	11,427
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

నకిలీ బంగారం అంటగట్టి
రూ.11 లక్షలు స్వాహా

● లబోదిబోమంటున్న బాధితుడు
● పోలీసులకు ఫిర్యాదు

బళ్లారి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పొలంలో బంగారు చిక్కింది. దాన్ని అమ్ముకునేందుకు నాకు తెలియదు. ఇదో బంగారు కడ్డీ కావాలంటే చెక్‌చేసుకో అని బంగారు కడ్డీ ఇచ్చాడు. తొలిసారి అసలు బంగారు కడ్డీనే ఇచ్చాడు. తరువాతే నకిలీ బంగారం ఇచ్చి రూ. 11 లక్షలు తీసుకుని మోసగించాడు. ఇది బళ్లారి జిల్లా తోరణగల్లు గ్రామం జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలోని బాలాయపల్లి గ్రామానికి చెందిన జూడిపల్లి చలుమయ్య అనే వ్యక్తి జిందాల్ ఏరియాల్లో చాలా ఏళ్లుగా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇటీవల ఓ ఫోన్‌కాల్ వచ్చింది. నాది తిరుపతే.. నా పేరు రమేష్, నేను బాలాయపల్లిలో ఉంటాను. నేను పొలం దున్నుతుంటే బంగారు దొరికింది అని నమ్మబలికాడు. చలువయ్య కూడా నమ్మి సరే అని బంగారం తీసుకుని ముందు రూ.1.5లక్షలు ఇచ్చాడు. తొలిసారి ఇచ్చిన బంగారం అసలుదే. తరువాత రెండో సారి రమేష్ ఫోన్ చేసి మిగిలిన బంగారం కూడా ఇస్తాను, రూ.11లక్షలు అవుతుంది అన్నాడు. చలుమయ్య కూడా ఆశపడి డబ్బులు ఇచ్చాడు. బంగారు కడ్డీలు తీసుకుని కంసలితో పరీక్షించగా అవి నకిలీగా తేలింది. సిల్వర్ కడ్డీలకు బంగారు తాపడం వేసిన కడ్డీలుగా తేలింది. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న చలమయ్య తోరణగల్లు పోలీస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

అంబులెన్స్ ఢీకొని దంపతుల దుర్మరణం

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో దంపతులు దుర్మరణం చెందారు. శనివారం రాత్రి పొద్దుపోయాక బెంగళూరు శాంతినగర్‌కు అనుబంధమైన కేహెచ్ రోడ్డు సంగీత సిగ్నల్ వద్ద ప్రైవేటు ఆస్పత్రికి చెందిన అంబులెన్స్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. బైక్‌లోని దంపతులు ఇస్మాయిల్ (40), సమీనాబాను (33) దుర్మరణం చెందారు. వీరు సోమేశ్వరనగర్‌కు చెందినవారిగా గుర్తించారు. రిచ్‌మండ్ రోడ్డువైపు నుంచి వేగంగా వచ్చిన అంబులెన్స్ ఊర్వశి టాకీస్ వైపు నుంచి విల్సన్‌గార్డెన్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనాన్ని సుమారు 30 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ట్రాఫిక్ పోలీసు చౌక్‌కు ఢీ కొట్టి అంబులెన్స్ నిలిచిపోగా డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు.. అంబులెన్స్‌ను పల్టీ కొట్టించి పరిశీలించగా ద్విచక్రవాహనంతోపాటు ఇద్దరు చిక్కుకున్నట్టు గుర్తించారు. ద్విచక్రవాహనం అంబులెన్స్ కింద ఉండగానే మరోబైక్‌ను ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న రియాన్, సిద్ధిక్ గాయపడ్డారు. విల్సన్‌గార్డెన్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, అంబులెన్స్ డ్రైవర్ అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. దంపతుల మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

14న ముహూర్తం..!

● బిహార్ ఎన్నికల తరువాత రాజకీయ మార్పులు..?
● కొందరు మంత్రులకు చలనం గ్యారెంటీ..
● ముఖ్యమంత్రి మార్పుపైనే సర్వత్రా ఉత్కంఠ



బళ్లారి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 14 తర్వాత కీలక మార్పులు ఉండబోతున్నావని జోరుగా చర్చలు మొదలయ్యాయి. మంత్రులనే మారుస్తారా.. సీఎంనూ మారుస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా మార్పు ఉంటుందా.? ఉంటే ఎంత మంది ఉంటుంది.? ఎవరు కేబినెట్‌లో చేరుతారు.? ఎవరికి పదవి పోవచ్చు? ఇలా రాజకీయ చర్చలు రోజూ ఊపందుకున్నాయి. కొందరు మంత్రులు మార్పు మాత్రం గ్యారెంటీ. కానీ ఇంకా ముఖ్యమంత్రి మార్పు అనేది స్పష్టత లేదు. అని కాంగ్రెస్ ఢిల్లీ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొందరు మంత్రుల మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధిష్టాన వర్గాలు సూచాప్రాయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంకేతం ఇచ్చినట్లు కొందరు ఎమ్మెల్యేలు చర్చించుకుంటున్నారు. ప్రసుత్తం ఉన్న మంత్రి వర్గంలో పనిచేస్తున్న వారు ఎవరు.? పనిచేయకుండా ఉండేవారు ఎవరు. ఇలా ర్యాంకింగ్‌తో పాటు కొత్త ఎమ్మెల్యేలకు కూడా మంత్రి పదవులు ఇవ్వాలనే భావనలో కాంగ్రెస్ ఢిల్లీ అధిష్ఠాన ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల బిహార్ ఎన్నికల ఫలితాలపైనే అధిష్ఠానం అడుగులు వేయనున్నట్లు తెలుస్తోంది. ఆ ఎన్నికల తరువాతే రాజకీయ మార్పు చేయాలనే భావనతో కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో మంత్రిపదవులు కోసం రేసులో ఉండే ఎమ్మెల్యేలు, ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇక బెల్గాంలో కూడా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జార్కిహోళి కూడా ఎమ్మెల్యేలతో విందు రాజకీయం నడిపారు. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుండి దించితే జార్కిహోళికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అది జరుగుతుందో లేదో కానీ ఆయన పేరు మాత్రం జోరుగా వినిపిస్తోంది. సిద్ధరామయ్య కుమారుడు కూడా జార్కిహోళికి ముఖ్యమంత్రి పదవికి అర్హుడేనని ఇటీవల ఓ సభలో వ్యాఖ్యానించారు. డీకే శివకుమార్ తో పాటు ఆదే సామాజవర్గం కు చెందిన కృష్ణబైరేగౌడ పేరు కూడా వినిస్తోంది.. ఒక వేళ తనను ముఖ్యంత్రి పదవి నుండి దించితే కృష్ణబైరేగౌడకు అవకాశం ఇవ్వాలని సిద్ధరామయ్య అన్నట్లు ప్రచారం సాగింది. ఇక సిద్ధరామయ్య కుమారుడు యతేంద్ర అయితే జార్కిహోళి పేరును బహిరంగ సభలో ప్రస్తావించారు. తండ్రి ఓ పేరు, కుమారుడు మరో పేరు ప్రస్తావించడం చర్చనీయాంశమయ్యింది. బీహార్ ఎన్నికల పోలింగ్ నవంబరు 11 జరగనున్నాయి. ఫలితాలు ఇదే నెల 14న వస్తాయి. ఫలితాలు తరువాత ఇదే నెల లేదా.. కొత్తసంవత్సరం అంటే జనవరిలో కర్ణాటకలో మంత్రులు, ముఖ్యమంత్రి మార్పులు ఉంటాయనే చర్చలు జోరుగా సాగుతున్నాయి.

రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలించిన డివిజన్ మేనేజర్

రాయచూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్‌లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఆదివారం గుంతకల్ రైల్వే డివిజన్ మేనేజర్ జితేంద్ర కుమార్ రాయచూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. తొలుత యాదగిరి రైల్వే స్టేషన్‌ను సందర్శించుకొచ్చిన జితేంద్ర కుమార్ రాయచూరు రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎస్కలేటర్ పనులను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తేయనున్నట్లు ఈ సందర్భంగా మేనేజర్ జితేంద్ర కుమార్ తెలిపారు. వీటితో పాటు లిఫ్ట్ మరమ్మత్తులు వారం 10 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. కాగా కాచిగూడ-రాయచూరు డెమో రైలు సాయంత్రానికి బదులు ఉదయం వేళ నడిపేలా చర్యలు తీసుకోవాలంటు ప్రయాణీకులు కోరినట్లు ఆయన వివరించారు. దీంతో పాటు కోవిడ్ సమయంలో నిలిపివేసిన గుంతకల్-కలబుర్గి ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలని ప్రయాణీకులు కోరినట్లు తెలిపారు.



రాయచూరు రైల్వే స్టేషన్ సిబ్బందితో మేనేజర్ జితేంద్ర కుమార్

సమస్యకు సెలవు.. సంచారం సులువు..!

● పూర్తయిన హలకుంది ఫ్లైఓవర్ పనులు ● వాహనాలకు అనుమతిచ్చిన అధికారులు ● నగరంలో తీరనున్న ట్రాఫిక్ సమస్య



ఫ్లైఓవర్‌పై సంచరిస్తున్న వాహనం



వంతెనపై శుభ్రం చేస్తున్న కూలీలు

బళ్లారి గాంధీనగర్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల శాఖ గత పదేళ్ళ క్రితం హొసపేట నుంచి గుత్తి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణం పనులు వేగవంతం అవుతున్నాయి. మొదట ఈ పనులను గ్యామెన్ ఇండియాకు పనులు చేపట్టగా.... నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయనందుకు ఆ పనులను మరో సంస్థకు అప్పగించింది. అప్పటి నుంచి పనులు వేగవంతం అయ్యాయి. ఇందులో భాగంగా బళ్ళారి పరిధిలో వేణీవీరాపురం నుంచి హలకుంది మీదుగా ?హగరి వరక సుమారు 18 కిలోమీటర్ల పరిధిలో వంతెనలు, ఫ్లై ఓవర్లు నిర్మాణాలు పూర్తి కావడంతో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వాహనాల రాకపోకలకు ఎన్‌హెచ్‌ఏ అధికారులు అనుమతించారు. బళ్ళారి మీదుగా అనంతపురం వైపు వెళ్ళే వాహనాలు ముండరిగి వద్ద నిర్మించిన బైపాస్ మీదుగా వెళ్ళేవి. ఈ బైపాస్ రైల్వే ట్రాక్ గుండా వెళ్తున్న కారణంగా రైలు గేటుపడిన ప్రతిసారి కిలోమీటర్ల కొద్ది లారీల రాకపోకలు ఆగిపోయేవి. దీంతో బెంగళూరు నుంచి బళ్ళారి నగరానికి చేరుకునే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం హలకుంది వద్ద జాతీయ రహదారి ప్రారంభం కావడంతో హొసపేట నుంచి అనంతపురం వైపు వెళ్ళే వాహనాలు వేణీవీరాపురం నుంచి హలకుంది మీదుగా హగరి వద్ద గొడెహాల్ వరకు ఎలాంటి అండకులు లేకుండా చేరుకుంటాయి. ఈ కారణంగా నగరంలో భారీ వాహనాల సంచారం కొంత తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఫ్లై ఓవర్ పనులు నిర్మాణంలో ఉన్న కారణంగా హరిగిణి డోని చుట్టప్రక్కల రైతులు రహదారిపై పంట ఉత్పత్తులు అరబెట్టుకునేందుకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం ఫ్లై ఓవర్ ప్రారంభం కావడంతో రోడ్డుపై ఆరబెట్టిన పంట ఉత్పత్తులను అధికారులు తొలగించాలని సూచించడంతో రైతులు విధిలేని పరిస్థితిలో ఉత్పత్తులను తొలగించాల్సి వచ్చింది.



నీటి కొరతపై ఆవేదన వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

పర్యాటకులకు పానీపాట్లు

● హంపిలో వారం రోజులుగా కొళాయిలకు రాని నీరు
● టాయిలెట్స్‌లో నీరు లేక తప్పని ఇబ్బందులు

బళ్లారి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం హంపిలో నీటి కొరత పర్యాటకులను వేధిస్తోంది. ఇటీవల హంపికి పర్యాటకుల సందడి పెరిగింది. అయితే మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు అపఖ్యాతి మూట కట్టుకుంటున్నారు. పర్యాటకుల నుంచి పలు రకాలుగా రుసుం వసూలు చేస్తున్నారు. అక్కడ సౌకర్యాలు కల్పించడం లేదని పర్యాటకు ఆరోపిస్తున్నారు. హంపి లోని లోటస్ మహల్, ఆనేశాల, రాణి బాత్ ప్లేస్. మహానవమి దిబ్బ, కోదండరామ స్వామి టెంపుల్, విఠలాపురం దేవస్థానం తదితర ప్రాంతాల్లో పర్యాటకులకు తాగునీటి వసతి లేదు. తాగునీరు కొనుక్కొని తాగినా టాయిలెట్స్‌లో నీరు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంరోజుల నుంచి నీరు రాక బాత్‌రూముల్లో దుర్వాసన వెదజల్లుతోందని పర్యాటకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

రైల్లో నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

గార్లదిన్నె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రైల్లో నుంచి పడి చిన్నవీరా అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల మేరకు.. రాయచూరు జిల్లా షాపూర్‌కు చెందిన చిన్నవీరా బెంగళూరులోని వాటర్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఇంటికి వెళ్లేందుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్నాడు. డోర్ వద్ద కూర్చున్నాడు. తోటి ప్రయాణికులు గొడవ పడ్డారు. ఈక్రమంలో డోర్ వద్ద కూర్చున్న చిన్నవీరాను గొడవపడుతున్న ప్రయాణికులు తోసేశారు. ఈ ప్రమాదంలో చిన్నవీరాకు కుడికాలు విరిగిపోగా, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'పాత్రికేయులకు ఇంటి వసతి కల్పిస్తాం'



పాత్రికేయులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

కంప్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తాలుకాలో ఉన్న పాత్రికేయులకు ఇంటి స్థలాలు అందించేందుకు కృషి చేస్తామని తాలుకా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు వీరేష్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. తాలుకా పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికైన దేవనగౌడ పటేల్‌కు, బళ్లారిలో కర్ణాటక రాజ్యోత్సవ వేడుకల్లో సాహిత్య క్షేత్రంలో రాణించిన బంగిదొడ్డు మంజునాథ, అమరనాథ్ శాస్త్రిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే పత్రికా భవనం, మిగిలి వున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాల విషయంపై ఎమ్మెల్యేతో చర్చించి ఏర్పడేలా చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండితారాధ్య కరి విరుపాక్షి చంద్రశేఖర్‌గౌడ్, వెంకటేష్, యమనప్ప, చంద్రశేఖర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అధ్యక్షురాలిగా అయ్యమ్మ

కంప్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కంప్లి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సహకార సంఘం నూతన ఉపాధ్యక్షురాలిగా జీ అయ్యమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. తమ నివాసంలో భర్త ఈశప్ప అయ్యమ్మకు స్వీట్స్ తినిపించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యక్షురాలు అయ్యమ్మ మాట్లాడుతూ అందరి సహకారం వల్లే తమకు ఉపాధ్యక్ష స్థానం పదవి లభించిందన్నారు. రైతులకు సహకార సంఘం సదుపాయాలను అందించి నిజాయితీగా సేవ చేస్తానని తెలిపారు. సంఘం అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. అధ్యక్షుడు కేఎస్ దొడ్డ బసప్ప, నాయకులు శరణగౌడ, వీరేష్, హనుమంతప్ప పాల్గొన్నారు.



అయ్యమ్మను అభినందిస్తున్న భర్త ఈసప్ప

రాష్ట్రంపై కేంద్రం చిన్నచూపు

● సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులు

కంప్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమవుతుందని ఎమ్మెల్యే గణేష్ మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంపై నిరసనగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం టీవీలకి, పేపర్లకి ప్రచారానికి పరిమితమైందన్నారు. అభివృద్ధిలో శూన్యమన్నారు. తమ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సదుపాయాలు పథకాలు చూసి ఓర్వలేదన్నారు. ప్రతి ఎన్నికల్లో ఓటర్లకు మభ్యపెట్టి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఎంతోమంది ప్రజలు రైతులు ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే సదుపాయాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ట్యాక్స్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు వెళ్లినా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే నిధులు అరకొరగానే ఉన్నాయన్నారు. రాష్ట్రంపై కేంద్రం చిన్నచూపు చూస్తోందన్నారు. ఈ రాష్ట్రానికి కేంద్రం ద్వారా వచ్చే సదుపాయాలు ఇవ్వడంలో వెనుకంజ వేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంతకాల సేకరణ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం విరుద్ధంగా తమ సంతకాన్ని చేపడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బసవరాజు, పుర అధ్యక్షులు బట్టప్రసాద్, హబీబుర్ రెహమాన్, సుధీర్, వీరాంజనేయులు, సీఆర్ హనుమంతు, జగదీష్, ఉస్మాన్, శశికుమార్, జాఫర్, తిమ్మప్ప, శేఖర్, గోపాలకృష్ణ, విరుపాక్షి, రాజేష్, గోపాల్, సురేష్, జాఫర్, షణ్ముఖప్ప, ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గేదెపై చిరుత దాడి

రాయచూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరకెరా తాలూకా కొత్తదొడ్డి గ్రామ సమీపంలోని హిరేగుడ్డదయ్య ఆలయ సమీపం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనక భాగంలో గేదె పై చిరుత దాడి చేయడం కలకలం రేపింది. శనివారం రాత్రి చిరుత దాడిలో గేదె తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న అటవి శాఖ అధికారులు ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. చిరుత సంచరించిన ప్రదేశాలను పరిశీలించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రజలు రాత్రి వేళల్లో బయటికి రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. కాగా చిరుతను బంధించేందుకు అధికారులు బోను ఏర్పాటు చేసే పనులో ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

వరికోత మిషన్లకు పెరిగిన డిమాండ్

● జోరువానలతో కోతలకు సిద్ధమైన రైతులు



సన్నాపురం వద్ద వరి పంటను తొలగిస్తున్న మిషన్

కంప్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వరి కోత మిషన్లకు ఫుల్ డిమాండ్ పెరిగింది. ఇటీవల వానలతో పలు ప్రాంతాల్లో వరి నేలకొరిగింది. దీంతో రైతులు కోతలకు సిద్ధమయ్యారు. ఎకరాకు రూ.3500 నుంచి రూ.4 వేల వరకు కోత మిషన్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రూ.2500 నుంచి రూ.3 వేల వరకు ఎక ఎకరాకి డిమాండ్ పలికేది. వర్షం రావడంతో పొలాలన్నీ పూర్తిగా నేలకొరగడంతో మిషన్లకు డిమాండ్ పెరిగిందని రైతులు వాపోతున్నారు. సన్నాపురం, ఇటిగి, బసవేశ్వర క్యాంపు, మారెమ్మ క్యాంపు ఇతర గ్రామాల్లో కోతలు జోరుగు సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో యేడాది రైతులకు నష్టాలు వాటిల్లాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలకు గాలులకు వరి పంటలు పూర్తిగా నష్టపోయాయి. దీనికి తోడు వర్షపాతంతో దిగుబడులు తగ్గిపోయాయి. పెట్టుబడులు మాత్రం రూ. 35 వేలకు పైగా వచ్చాయన్నారు. కాస్తో కూస్తో పండిన పంటలకు మార్కెట్లలో రేట్లు లేక సతమతమవుతున్నామని వాపోతున్నారు. ఈ యేడాది ఖరీఫ్ సీజన్ నష్టాలు ఇచ్చిందని తెలిపారు.



వర్షంతో నేలకొరిగిన వరి పంట

హోసూరు జోన్



నీటిలోనే శ్మశానానికి తరలుతున్న గ్రామస్థులు

వంతెన లేక అంత్యక్రియలకు అవస్థలు

హోసూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపంలో స్మశానవాటికకు వెళ్లాలంటే అడవుల నుంచి వచ్చే నీటికాలువ ప్రవాహం అడ్డుగా ఉంది. ఇటీవలి వర్షాలకు నడుములోతు మేర నీరు ప్రవహిస్తోంది. 98 ఏళ్ల వృద్ధురాలి మృతదేహాన్ని అంత్యక్రియలకోసం బంధువులు నీటిలో నడుస్తూ మోసుకెళ్లిన అంశం స్థానికులను కలచివేస్తోంది. కృష్ణగిరి జిల్లా శూలగిరి సమీపంలోని బీలాళం గ్రామానికి చెందిన కుర్రమ్మ(98)అనే వృద్ధురాలు ఆదివారం అనారోగ్య కారణాలతో మృతి చెందింది. అంత్యక్రియల నిర్వహణకు అవస్థలు ఎదుర్కొనాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోయారు. మృతదేహం వెంట మహిళలు కూడా ఒక తాడు సాయంతో నీటిలో నడిచారు. శ్మశానానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గార్డును కరిచిన వీధికుక్క

హోసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని బత్తలపల్లి ప్రాంతంలోని ఒక ప్రైవేట్ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా మునిలక్ష్మి(50) పనిచేస్తున్నారు. మెడికల్ కళాశాల ఆసుపత్రి వద్ద పెద్ద సంఖ్యలో వీధి కుక్కలు తిరుగుతున్నాయి. ఆదివారం మునిలక్ష్మమ్మ కాలును ఓ వీధికుక్క కరిచింది. ఆమెను చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వెంటనే డాక్టర్లు ప్రథమ చికిత్సగా టీకాలు రేబిస్ టీకాలు వేసిన అనంతరం అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఒక ప్రైవేట్ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఆవరణలో పెద్ద సంఖ్యలో వీధికుక్కలు తిరుగుతుండటం వల్ల అక్కడికే వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీధికుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలనే స్థానికులు డిమాండ్ చేశారు. హోసూరు నగరంలో 45 వార్డులు ఉండగా హోసూరు చుట్టూ 200కుపైగా గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో రోజూ నలుగురైదుగురు వీధికుక్కల కాటుకు గురవుతున్నారు. పెరిగింది.

పెద్దలను స్మరించుకున్న క్రైస్తవులు

హోసూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆల్ సోల్స్ డేలో భాగంగా క్రైస్తవులు తమ పూర్వీకులను స్మరించుకున్నారు. ఏటా నవంబరు 2న క్రైస్తవులు ఆచరిస్తున్నారు. ఆదివారం హోసూరు మత్తిగిరి శ్మశానవాటికల్లోని తమ పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, పుష్పాలు సమర్పించి స్మరించారు. పాత మత్తిగిరి కుసినిపాళ్య , గాడిపాళ్యం, కుదురేపాళ్యం, టైటాన్, టౌన్‌షిప్ వంటి ప్రాంతాల నుంచి క్రైస్తవులు పాల్గొని తమ పూర్వీకులకు నివాళులర్పించారు. అనంతరం మత్తిగిరి చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది క్రైస్తవులు తమ కుటుంబాలతో పాల్గొన్నారు. మత్తిగిరిలోని కుదిరేపాళ్యంలో రెండు చర్చ్‌లలో ప్రార్థనలు చేశారు. అన్నై చర్చి, మత్తిగిరిలోని నేతాజీనగర్‌లో నిర్మించిన కొత్తచర్చ్‌లో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని పూజలు చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

పృథ్విరాజ్ కపూర్ (జయంతి)



దేశ తొలి టాకీ సినిమా 'ఆలం ఆరా' లో నటించిన 'పద్మభూషణ్' గ్రహీత పృథ్విరాజ్ కపూర్ 1906 నవంబరు 3న పంజాబ్ రాష్ట్రం ఫైసలాబాద్ ప్రాంతంలో జన్మించారు. పృథ్వీ థియేటర్స్ సంస్థాపకుడు. హిందీ సినీరంగంలో పేరొందిన నటుడు. స్వాతంత్ర్య ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో యువత పాల్గొనేలా సినిమాలు రూపొందించారు. రాష్ట్రపతి మెడల్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ గ్రహీత. 1972 మే 29న కన్నుమూశారు.

విజయ రాఘవరావు (జయంతి)



వేణుగాన విద్వాంసుడు 'పద్మశ్రీ' గ్రహీత పండిట్ ఏల్చూరి విజయ రాఘవరావు 1925 నవంబరు 3న మద్రాసులో జన్మించారు. సంగీత దర్శకుడు, కొరియోగ్రాఫర్, కంపోజర్, రచయిత. పండిట్ రవి శంకర్‌తో కలసి ప్రపంచవ్యాప్తంగా సంగీతకచేరీలు నిర్వహించిన ఘనత ఆయనది. ఆలిండియా రేడియో ఫిల్మ్ డివిజన్‌కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత. 2011 నవంబరు 30న కన్నుమూశారు.

జిక్కి (జయంతి)



సినీ నేపథ్యగాయని జిక్కి 1935 నవంబరు 3న చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జన్మించారు. అసలు పేరు పీజీ కృష్ణవేణి. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ, సింహళ భాషలలో 10వేలకుపైగా పాటలు పాడారు. మెలోడీ పాటలకు పెట్టింది పేరు. మద్రాస్ తెలుగు అకాడమీచే ఉగాది పురస్కారం, తమిళనాడు ప్రభుత్వంచే కలైమామణి పురస్కారం పొందారు. 2004 ఆగస్టు 16న కన్నుమూశారు.

అమర్త్యసేన్ (పుట్టినరోజు)



'భారతరత్న' అమర్త్యకుమార్ సేన్ 1933 నవంబరు 3న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం శాంతినికేతన్ ప్రాంతంలో జన్మించారు. ప్రపంచంలో పేరొందిన ఆర్థికవేత్త. ప్రజా ఆరోగ్యం, సామాజిక న్యాయం, ఆర్థిక సంక్షేమానికి పాటుపడ్డారు. యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్‌లో దశాబ్దాల పాటు ఆర్థికసేవలు అందించారు. నోబెల్ స్మారక పురస్కారం, 2020 పీస్ ప్రైజ్ ఆఫ్ ది జర్మన్ బుక్ ట్రేడ్, 90కుపైగా గౌరవ డాక్టరేట్‌లు తదితర పురస్కారాలు పొందారు. 2021లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

కాత్యాయని విద్మహే (పుట్టినరోజు)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, అభ్యుదయ రచయిత్రి కేతవరపు కాత్యాయని విద్మహే 1955 నవంబరు 3న ప్రకాశం జిల్లా (మైలవరం) అద్దంకి గ్రామంలో జన్మించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్. మార్క్సిజం, స్త్రీవాద దృక్పథం, సామాజిక సిద్ధాంతాలు తదితర 285వరకు వ్యాసాలు రాశారు. 275 పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆమె వద్ద 11మంది పీహెచ్‌డీ డిగ్రీలు పొందారు. 'చివరకు మిగిలేది - మానసిక సామాజిక జీవన స్రవంతి నవలా విమర్శ' అనే అంశంపై పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక రాష్ట్ర కార్యదర్శిగా, మానవ హక్కుల వేదిక సభ్యురాలిగా ఉన్నారు.

చిన్నజీయర్ స్వామి (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి 1956 నవంబరు 3న తూర్పు గోదావరి జిల్లా అర్తమూరులో జన్మించారు. 23ఏళ్లకు జీయర్ అయ్యారు. వేదగురువు, ఉపదేశకులు, వైష్ణవ సంప్రదాయ ప్రముఖులు. సన్యాస స్వీకరణ తర్వాత కొన్నేళ్లకు గీతా జ్యోతి ఉద్యమాన్ని చేపట్టారు. భగవద్గీత ప్రాచుర్యం, వేదవిద్య విస్తరణకు ఆశ్రమాలు స్థాపించారు. అంధులను చేరదీసి కంప్యూటర్‌లో రాణించేలా కళాశాలలు స్థాపించారు. శంషాబాద్‌లో జిమ్స్ ఆసుపత్రి ద్వారా ఉచితవైద్యం అందిస్తున్నారు.

మద్యం తాగవద్దన్నందుకు మిత్రుడిపై దాడి.. మృతి

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సాధారణంగా కష్టకాలంలో బంధువులకంటే మిత్రులే అండగా ఉంటారనే మాట ఉంది. మిత్రులంటే పరస్పరం కష్టసుఖాలు పంచుకుంటారు. అయితే మద్యం తాగవద్దని హితవు పలికిన మిత్రుడిపై దాడి చేసి హతమార్చిన సంఘటన హాసన్ జిల్లాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. అరసికెరె తాలూకా రాంపురలో రమేశ్‌కు మద్యం వ్యసనం వీడాలని మిత్రుడు గిరీశ్ (44) సూచించాడు. మద్యం తాగి వచ్చిన రమేశ్‌కు బుద్ధిమాటలు చెప్పాడు. అందుబాటులో ఉన్న రాయితో గిరీశ్‌పై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయాలై కుప్పకూలాడు. స్థానికులు గమనించి అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక గిరీశ్ మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాముల బెడద

పరిగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రశాంతినగర్ కాలనీలోని ఉర్దూ పాఠశాలలో పాముల బెడద తీవ్రంగా మారింది. పాఠశాల ఆవరణంలో పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండటంతో పాములు అధికంగా ఉంటున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 40 మంది వి ద్యార్థులు చదువుకుంటున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ప రిసరాలు శుభ్రం చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పిల్లలకు ప్రమాదం ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



విధానసౌధకు రాజ్యోత్సవ రంగులు

కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా విధానసౌధను విద్యుద్దీపాలతో ఇలా అలంకరించారు. ఆదివారం పసుపు, కుంకుమరంగులతో సందర్శకులను ఆకట్టుకుంది.

(ఆంధ్రజ్యోతి, బెంగళూరు)

ఆలయాల్లో కార్తీక పూజలు



వాసవీమాతకు విశేష అలంకరణ



కురుడుమలె వినాయకుడికి అలంకరణ



కైవారలో తులసిపూజలో బాలికలు

ముళబాగిలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ది ద్వాదశి) నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా ఆలయాలలో ఆదివారం విశేష పూజలు కొనసాగాయి. పట్టణంలోని బజారురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. సాయంత్రం తులసిపూజలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా తాలూకాలోని కురుడుమలె వినాయకుడికి ప్రత్యేక అభిషేకం, అలంకరణలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసి పండుగ

చింతామణి(ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా తులసి పండుగ ఆచరించారు. కార్తీకశుద్ధ ద్వాదశిన తులసి పండుగ పాటించడం ఆనవాయితీ. ప్రతి ఇంటి ఆవరణలోని బృందావనాన్ని స్వచ్ఛపరిచి రంగవల్లులు వేసి తోరణాలతో ముస్తాబు చేశారు. తులసికోటతోపాటు ఉసిరి కొమ్మను ఉంచి పూజలు చేశారు. అనంతరం చుట్టుపక్కల ముత్తైదువులకు తాంబూలం అందచేశారు. పిల్లలు బాణాసంచా కాల్చి సంబరపడ్డారు.

మీ సహాయం కోసం మేమున్నాం

▸▸ బిహార్ వాసులకు డీసీఎం అభయం



ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికలలో మహాఘట్‌బంధన్‌కు మద్దతు ఇవ్వాలని, మీ సహాయం కోసం మేమున్నామని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. బ్యాటరాయనపుర నియోజకవర్గ పరిధిలోని కాఫీబోర్డు లే అవుట్‌లో ఆదివారం రాత్రి స్థానిక బిహార్ వాసులతో డీసీఎం ప్రత్యేక సమావేశం జరిపారు. బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు విని యోగించుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీని ప్రధాని కావాలంటే బిహార్‌లో బలం పెరగాలన్నారు. తేజస్విని ముఖ్యమంత్రిని చేయాలని ఆకాంక్షించారు. మీకు అవసరమైన సాయం చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజాప్రభుత్వంలో ఓటు కీలకమన్నారు. నితీశ్‌కుమార్ అధ్యాయం ముగిసిందని, నాకు ఉన్నతమైన హోదా కావాలని ఆకాంక్షిస్తున్నారని, అంతకంటే బిహార్‌లో తేజస్వి సీఎం కావడం ముఖ్యమన్నారు. బెంగళూరులో 1.40 లక్షలమంది బిహార్ వాసులు ఉన్నారని అందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లాలన్నారు. బిహార్ వాసులకోసం కమ్యూనిటీ భవనం నిర్మిస్తామన్నారు. ఈనెల 5న బిహార్ వెళ్తున్నానన్నారు. బెంగళూరు నగరంలో వివిధ ప్రాంతాలలో స్థిరపడిన బిహార్‌వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పరోక్షంగా రవాణాకు సౌలభ్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.



కాఫీబోర్డు లే అవుట్‌లో హాజరైన బిహార్ వాసులు

బూత్‌స్థాయిలో క్రియాశీలకం కావాలి

▸▸ మంత్రి కేహెచ్ మునియప్ప

విజయపుర, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలంతా బూత్‌స్థాయిలో క్రియాశీలకం కావాలని పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపణలకు అనుగుణంగా ఓటుచౌర్యంపై సంతకాల సేకరణకు సిద్ధం కావాలన్నారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని గీతా కన్వెన్షన్ హాల్‌లో కర్ణాటక కాంగ్రెస్ సమితి, దేవనహళ్ళి శాసనసభ నియోజకవర్గ వ్యాప్తంగా ఓటుచౌర్యంకు వ్యతిరేకంగా ఆదివారం ఏర్పాటైన సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మాట్లాడారు. రానున్న ఎన్నికలకను కేంద్ర ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. కేపీసీసీ కార్యదర్శి వీ మంజునాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 224 నియోజకవర్గాలకుగాను 136 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. మంత్రివర్గంలో మన నియోజకవర్గ ఎమ్మెల్యే, సీనియర్ నేత మునియప్పకు చోటు దక్కిందన్నారు. రానున్నరోజుల్లో కాంగ్రెస్ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆర్‌వీ వెంకటేశ్, విజయపుర బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దిన్నూరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు చేస్తున్న మంత్రి మునియప్ప తదితరులు

కన్నడను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే



కన్నడలో వందశాతం మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

శిడ్లఘట్ట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కన్నడ భాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, యువతకు కన్నడ చరిత్ర, సంస్కృతి కళలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సల్లాపురమ్మ దేవాలయం వద్ద కన్నడరాజ్యోత్సవంలో పాల్గొని కన్నడమాత భువనేశ్వరిదేవి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. కన్నడ భాషకు వేలసంవత్సరాల చరిత్ర ఉందని ఈ వైభవాన్ని కాపాడుకోవాల్సి ఉందన్నారు. స్వాభిమానం సంకేతమే రాజ్యోత్సవం అన్నారు. వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో తహసీల్దార్ గగనసింధు మాట్లాడుతూ మన భాషా సంస్కృతి, ఏక్తా సంకేతమే కన్నడ రాజ్యోత్సవమన్నారు. కేవలం ఒకరోజుకే పరిమితం కారాదన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీలో కన్నడ భాషలో 125కు 125 మార్కులు సాధించిన 33మంది విద్యార్థులు, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో తాలూకా పంచాయతీ ఈఓ ఆర్ హేమావతి, నగరసభ కమిషనర్ జీ అమృత, అధ్యక్షులు ఎం వెంకటస్వామి, బీఈఓ నరేంద్రకుమార్, కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ రాజీవ్‌గౌడ, కసాప అధ్యక్షులు పటేల్ నారాయణస్వామి, రేష్మనగర కన్నడ రాజ్యోత్సవ సమితి రామాంజనేయ తదితరులు పాల్గొన్నారు.

యూత్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించండి

దొడ్డబళ్ళాపుర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముస్లి యూత్ అసోసియేషన్‌కు ఎంపిక కాకుండా ఎన్నికలు నిర్వహించాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్‌కు అడహాక్ కమిటీ ఏర్పాటు చేసే ప్రయత్నాన్ని ఖండించారు. పట్టణంలో ప్రవాసిమందిరంలో మీడియాతో మాట్లాడారు. తాలూకాలో ముస్లిం సామాజికవర్గానికి చెందినవారు 25వేలమంది ఉన్నారని, 37 మసీదులు ఉన్నాయన్నారు. అన్ని మసీదుల ప్రముఖులు కలసికట్టుగా చేరి ఓటరు జాబితా సిద్ధం ఎన్నికలు జరపాలని కోరుతున్నట్టు తెలిపారు. పట్టణంలోని రెండు వార్డుల వారు మాత్రమే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారన్నారు. అసోసియేషన్‌కు 13 ఏళ్లక్రితం ఎన్నికలు జరిగాయన్నారు. దేశ రాజ్యాంగాన్ని సైతం కాలానికి అనుగుణంగా సవరణలు చేశారని అయితే అసోసియేషన్ బై-లాలోని చిన్న పొరపాట్లను చూపి అడహాక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. తాలూకాలోని మొత్తం ముస్లింలకు ప్రాతినిధ్యం వహించాల్సిన వక్ఫ్‌బోర్డు కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాలానికి అనుగుణంగా ఎన్నికలు జరపలేదని ఏటా సామూహిక వివాహాలు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్, వృద్ధులకు పెన్షన్ వంటివి అమలు చేయలేదన్నారు. నామమాత్రంగా సభ నిర్వహించి టీ ఖర్చు రూ.35వేలు ఖర్చు రాస్తున్నారని రోటపించారు. మీడియా సమావేశంలో శ్రీనగర్ బషీర్, రఫీక్‌పాషా, ఇబ్రహీం, ఇష్తకార్ అహ్మద్, నయాజ్‌ఖాన్, నూర్‌భాయ్, ఇలియాస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

ఆగివున్న టెంపోకు ఉరివేసుకుని ఆత్మహత్య

చింతామణి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రద్దీ ప్రాంతమైన బంబూ బజార్‌లో ఆగియున్న టెంపో వెనుకభాగాన కమ్మీలకు తాడుకట్టి ఒక వ్యక్తి ఉరివేసుకున్నాడు. శనివారం రాత్రి ఘటన చోటు చేసుకుంది. స్థానిక చికెన్ దుకాణంలో పనిచేసే మంజుళ, రంగణ్ణల పెంపుడు కుమారుడు మధు (28) ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిగా గుర్తించారు. సంతానం లేని దంపతులు మధును 20ఏళ్ల క్రితం తెచ్చుకుని పెంచుకుంటున్నారు. కొంతకాలంగా మధు మానసిక అస్వస్థతతో ఉన్నట్టు తెలుస్తోంది. ఈకారణంగానే స్థానికంగా ఆగియున్న టెంపోకు ఉరివేసుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు.



మధు (ఫైల్)

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వేదికపై చిన్నారులు

బెంగళూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెలమంగల విశాల పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులు వివిధ ప్రదర్శనల్లో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు నరసేగౌడ మాట్లాడుతూ కన్నడభాషకు రెండువేల ఏళ్ల చరిత్ర ఉందన్నారు. భవిష్యత్తులోనూ కన్నడకు ఢోకా లేదన్నారు. ప్రధానోపాధ్యాయుడు చిక్కరుద్రప్ప, కార్యదర్శి మిథున్‌గౌడ, దిశ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వీకులను స్మరించుకున్న క్రైస్తవులు



మైసూరు రోడ్డులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బెంగళూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు తమ పూర్వీకులను స్మరించుకున్నారు. బెంగళూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలోని క్రైస్తవుల సమాధుల వద్ద కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం తమ పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి పూలుచల్లి ప్రార్థనలు చేశారు. పలు ప్రాంతాలలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

చాకవేలులో చురుగ్గా నిర్మాణ పనులు



కాలువ నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

చేళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకాలోని చాకవేలు గ్రామపంచాయతీ కేంద్రంలో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల బస్టాండ్ ప్రాంతంలో వర్షం కురిసినప్పుడు నీరు సజావుగా ప్రవహించక గుంతలలో నిలిచిపోయాయి. దీంతో వర్షపునీరు సజావుగా ప్రవహించేలా కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఆదివారం కూడా కార్మికులు పనిచేయడం గమనార్హం. బస్టాండ్‌లో వర్షం నీటి సమస్యలు లేకుండా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళకళలాడుతున్న చెరువులు

చేళూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకాలో ఇటీవల కురిసిన వర్షాలతో కళకళలాడుతున్నాయి. బాగేపల్లి మార్గంలోని షేర్‌ఖాన్ కోట చెరువు, చుట్టుపక్కల వంకలు నిండి పొంగి పొర్లుతున్నాయి. కాగా చెరువు నిండినా చెరువు కిందగల భూములకు కాలువల ద్వారా నీరు విడుదల చేయకపోవడంపై రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తూముల ద్వారా నీరు పొలాలకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. అధికారులు స్పందిస్తారని ఎదురు చూస్తున్నారు.



షేర్‌ఖాన్‌కోట చెరువు